

చెరువులో పడి మహిళ మృతి

హన్వాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని మునిమోక్షం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మునిమోక్షం గ్రామానికి చెందిన బుడ్డ భాగ్యమ్మ (45) శుక్రవారం ఉదయం కూలీ పనికి వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో అమ్మాపూర్ సమీపంలోని చెరువులో పడి శవమై కనిపించింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారని, కొడుకు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

పక్కన పెట్టేశారు!

దాతలు ఇచ్చిన ఆక్సిజన్ ప్లాంట్లను పక్కన పెట్టేశారు.. ఇతర కంపెనీల ద్వారా కొనుగోలు చేసి దర్జాగా ప్రభుత్వ ఖజానాకు చిల్లులు పెడుతున్నారు. ఇదంతా మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో జరుగుతున్న తతంగం. ఉన్నవాటిని మూలకు పడేసి మరమ్మతులు చేయకుండా నిరుపయోగంగా ఉంచడం గమనార్హం.

● ప్రాణవాయువుకు ప్రాధాన్యమేది?

- కొవిడ్ కాలంలో పీఎం కేర్ కింద మంజూరైన ఆక్సిజన్ ప్లాంట్లు
- నిర్వహణ లేక నిరుపయోగంగా కోట్ల రూపాయల యంత్రాలు
- మరమ్మతు చేయిస్తే నెలకు రూ.లక్షలు ఆదా
- బయటి నుంచి ఆక్సిజన్ కొనుగోలు
- మ్యానిఫోల్డ్ టెక్నీషియన్లు లేకుండా ఆపరేటర్లతో నిర్వహణ
- జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ వ్యవస్థ తీరిది



టాటా ఆక్సిజన్ ప్లాంటు

ఇన్‌స్టాలేషన్ చేయని యంత్రాలు..

ఆసుపత్రిలోని వెనుకభాగంలో కొవిడ్ సమయంలోనే మరో ఆక్సిజన్ ట్యాంకును కేంద్రం మంజూరు చేసింది. అది ఐదేళ్లుగా ఇన్‌స్టాలేషన్‌కు కూడా నోచుకోలేదు. దాని విలువ రూ. 90 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. 34వేల కేజీల సామర్థ్యం ఉన్న ఈ ట్యాంకు తుప్పుపట్టిపోతున్నది. అసలు దీన్ని ఎవరు ఇచ్చారో... దానికి సంబంధించిన రికార్డులు కూడా ఆసుపత్రి అధికారులతో లేవు. అత్యాధునిక టెక్నాలజీ ఉన్న ఈ ట్యాంకు ప్రస్తుతం మూలకు పడింది. మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం లేకపోలేదు.



మహీంద్ర ఆక్సిజన్ ప్లాంట్లు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మే 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రోగుల ప్రాణాలను కాపాడేందుకు దాతలు ఇచ్చిన ఆక్సిజన్ ప్లాంట్లను పక్కన పెట్టేశారు. కొవిడ్ కాలంలో పీఎం కేర్ కింద మంజూరైన కోట్ల రూపాయల ఆక్సిజన్ యంత్రాలు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అయితే వాటిని మరమ్మతులు చేయిస్తే నెలకు లక్షల రూపాయలు ఆదా అయ్యే అవకాశం ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా బయటి నుంచి ఆక్సిజన్‌ను కొంటున్నారు. అదేవిధంగా ఆ వ్యవస్థను పర్యవేక్షించే టెక్నీషియన్లు సైతం లేకపోవడంతో ఆపరేటర్లతోనే పనిచేయిస్తున్నారు. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తే రోగులకు మేలు జరిగే అవకాశం ఉంది.

పీఎం కేర్ కింద ప్లాంట్లు మంజూరు..

దేశంలో కొవిడ్ విజృంభిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రతీ జిల్లాకు ఆక్సిజన్ ప్లాంట్లను మంజూరు చేసింది. అందులో భాగంగా మహీంద్ర అండ్ మహీంద్ర లిమిటెడ్ కంపెనీ ఏఎఫ్ఎస్ జహీరాబాద్ నుంచి రూ. 70 లక్షల విలువైన 1000 ఎల్‌పీఎం సామర్థ్యం ఉన్న ఆక్సిజన్ ప్లాంటును 2021లో మంజూరు చేసింది. అదేవిధంగా టాటా కంపెనీ తరఫున కూడా 2021లో రూ. 1.50 కోట్ల విలువైన ఆక్సిజన్ ట్యాంకును మంజూరు చేశారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రిలో 2020లో లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకును కూడా ఏర్పాటు చేసింది. ఇవే కాకుండా రెండు సక్షన్ ఆక్సిజన్ ప్లాంట్లు కూడా ఉన్నాయి. ఇందులో టాటా, మహీంద్ర కంపెనీలు ఇచ్చిన ప్లాంట్లు మూలకు పడ్డాయి. వాటి నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని ప్రారంభించిన 3, 4 నెలల వరకు బాగానే నడిచాయి. ఆ తర్వాత ఎవ్వరు పట్టించుకోకపోవడంతో యంత్రాలు మూలకు పడ్డాయి. లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటుతో ఆసుపత్రిలోని 450 ఆక్సిజన్ పడకలకు అది అందుతోంది.

మరమ్మతులకు నోచుకోని వైనం..

టాటా కంపెనీ ఇచ్చిన ఆక్సిజన్ ప్లాంటు వైరింగ్‌ను ఎలుకలు కట్ చేశాయి. అదేవిధంగా సర్వీసింగ్ కూడా చేయాల్సి ఉంది. ఇందుకుగానూ రూ. 90 వేలు ఖర్చు అవుతుందని టెక్నీషియన్ ప్రతిపాదన చేసి ఆసుపత్రి అధికారులకు ఇచ్చారు. కానీ దాన్ని పక్కన పెట్టేశారు. మహీంద్ర కంపెనీ ఇచ్చిన ప్లాంటుకు కూడా జనరేటర్ అవసరం ఉంటుంది. రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందని గుర్తించారు. దాన్ని కూడా మరమ్మతులు చేయించలేదు. వీటితో పాటు ఎంసీహెచ్ వెనుక భాగంలో కూడా సక్షన్ ప్లాంట్లు కూడా మరమ్మతులకు నోచుకోవడం లేదు.

ఆపరేటర్లతో ఆక్సిజన్ వ్యవస్థ నిర్వహణ..

ఆసుపత్రిలోని ఆక్సిజన్ వ్యవస్థను నడిపించేది ఆపరేటర్లు. వాస్తవానికి ఆక్సిజన్ ప్లాంట్లను నడిపించడానికి, ఆక్సిజన్ ఎక్కడైనా లీక్ అవుతున్నా.. సరఫరా కాకపోయినా వాటి నిర్వహణ చూసేది మ్యానిఫోల్డ్ టెక్నీషియన్లు. కానీ ప్రస్తుతం ఆసుపత్రిలో టెక్నీషియన్లు లేరు. ఉన్నది నలుగురు మ్యానిఫోల్డ్ ఆపరేటర్లు మాత్రమే. వారికి కూడా సరైన విద్యార్హతలు లేవు. అందరు పదో తరగతి పాసై ప్రైవేటు ఆసుపత్రిలో అనుభవం ఉన్న వాళ్లను నియమించుకొని పని చేయించుకుంటున్నారు. ఆక్సిజన్ ఏ వార్డుకు ఎంత మోతాదులో సరఫరా చేయాలో కూడా తెలియని పరిస్థితిలో వారు ఉండడం గమనార్హం.

బయటి నుంచి ఆక్సిజన్ కొనుగోలు..

కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన ఆక్సిజన్ ప్లాంట్లు పనిచేయకపోవడంతో లిక్విడ్ ప్లాంటుపై ఆధారపడుతున్నారు. ఆక్సిజన్ సరఫరా చేసే కంపెనీ ద్వారా ప్రతీ నెల 3 నుంచి 4 ట్యాంకుల ఆక్సిజన్‌ను కొనుగోలు చేస్తున్నారు. ప్రతినెల రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల బిల్లులు ఆసుపత్రి నుంచి చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీలు ఇచ్చిన ఆక్సిజన్ ప్లాంట్లు వాతావరణం ద్వారానే వాటంతట అవే ఆక్సిజన్ తయారు చేసుకొని మనకు అందిస్తాయి. అందువల్ల ఉన్న ఆక్సిజన్ ప్లాంట్లను మరమ్మతులు చేయిస్తే బయటి నుంచి ఆక్సిజన్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు.



మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించాం..

వాస్తవానికి టాటా, మహీంద్ర కంపెనీలు ఇచ్చిన ఆక్సిజన్ ప్లాంట్లు నిర్వహణ లేకపోవడంతో మూలకు పడిన మాట వాస్తవమే. వాటిని మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు కూడా తయారు చేశాం. అయితే ఆ ప్లాంట్లకు కరెంటు ఎక్కువగా వస్తుందని, ఆక్సిజన్‌లో ప్యూరిటీ కూడా 94 శాతం మాత్రమే ఉంటుందని తెలిసింది. మరికొన్ని యంత్రాలను ఇప్పటికీ కూడా ఇన్‌స్టాల్ చేయలేదు. వాటన్నింటిపై టెక్నికల్ ఇంజనీర్లతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం. లిక్విడ్ ఆక్సిజన్‌ను కొనుగోలు విషయంలో కూడా దృష్టి పెట్టి లోపాలను సరిచేస్తాం. మ్యానిఫోల్డ్ టెక్నీషియన్ల నియామకాలపై కూడా చర్యలు తీసుకుంటాం.

- సంపత్‌కుమార్ సింగ్, సూపరింటెండెంట్,
జనరల్ ఆసుపత్రి, మహబూబ్‌నగర్

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

- ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు

7



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ అరుణ

ఉమ్మడి జిల్లా క్రికెట్ లీగ్ టోర్నీలో

పాలమూరు విజయం

- 5 వికెట్లు తీసిన ముఖీద్

7



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

మెడికల్ దుకాణాల్లో తనిఖీలు

- 18 షాపులకు నోటీసులు

6



దుకాణంలో ఔషధాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ దినేశ్‌కుమార్



తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

దేశం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం కావాలి

- ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో పేటలో తిరంగా ర్యాలీ

నారాయణపేటటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం కావాలని, దేశ రక్షణ ప్రథమ కర్తవ్యంగా ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని బీజేపీ సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ అన్నారు. 'మన దేశం కోసం సైనికులకు వందనం' అనే ప్రత్యేక కార్యక్రమంతో నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. మెయిన్ చౌక్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు జాతీయ జెండాలు చేతపట్టి భారత్ మాతాకి జై వందేమాతరం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. ర్యాలీని నిర్వహించారు.

పహల్గాం ఉగ్రదాడిని ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ రక్షణ ప్రథమ కర్తవ్యంగా ఇండియన్ ఆర్మీకి స్వేచ్ఛ హక్కులు కల్పించారన్నారు. భారతదేశం వైపు కన్నెత్తి చూడాలంటేనే ఇతర దేశాలకు హడలెత్తించేలా చేశారన్నారు.

పహల్గాం ఉగ్రదాడుల్లో అమాయక యాత్రికులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షు డు సత్యయాదవ్, రతంగపాండు రెడ్డి, శ్రీనివాసులు, పి.వినోద్, నందు, నామా జీ, రఘురామయ్యగౌడ్, సత్య రఘుపాల్, లక్ష్మి, శ్యాంసుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

- నకిలీ పత్తి విత్తనాల అమ్మకాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

మహబూబ్ నగర్ కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్తి విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి లేని బిజి-3 నకిలీ పత్తి విత్తనాల నియంత్రణకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీంలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన నకిలీ పత్తి విత్తనాల నియంత్రణపై అధికారులు, పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీమ్‌ల సమన్వయ సమావేశంలో ఆమె ఎస్పీ డి. జానకితో కలిసి మాట్లాడారు. జూన్ నెల కంటే ముందుగానే వర్షాలు పడుతున్నందున వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యాయన్నారు. జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా పత్తి సాగు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 75 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారని, వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ అనుమతిలేని బిజి-3 నకిలీ పత్తి విత్తనాల వంటివి అమ్మడం, విత్తడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మడం చట్టరీత్యా నేరం అన్నారు. అటు వంటి వారిపై 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, పీడీ యాక్ట్ నమోదుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిజి-3 నకిలీ పత్తి విత్తనాలు విత్తడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా వాతావరణం కలుషితం అవుతుందని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాల వల్ల వచ్చే పత్తితో తయారు చేసిన దుస్తువులు దరిస్తే చర్మ క్యాన్సర్ వస్తుందని తెలిపారు. శనివారం నుంచి ఈ నెల 28 వరకు 16 టాస్క్ పోర్స్ టీంలు జిల్లాలోని 259 డీలర్ ఓట్‌లెట్‌లను తనఖీ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో తేదీ దాటిన విత్తనాలు అమ్మినా, నిల్వ ఉంచినా, అనుమతి లేని నకిలీ విత్తనాలు అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇప్పటికే 1,19,000 కిలోల పత్తి విత్తనాలను సరాఫరా చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అనుమతి గల బిజి-2 పత్తి విత్తనాలను మాత్రమే లైసెన్సుడు ఓట్ లెట్ డీలర్ల నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. చెక్‌పోస్టులలో కూడా గట్టి నిఘా ఉంచాలని సూచించారు.

ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ గత సంవత్సరం జడ్చర్ల మండలం గోప్లాపూర్‌లో 151 కిలోలు, మరో 51 కిలోలు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ శుక్రవారం కూడా గోప్లాపూర్‌లోనే లక్షా 50 వేల విలువ కలిగిన 30 కిలోలు నకిలీ పత్తివిత్తనాలు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డి.సి.ఆర్.బి డీఎస్పీ రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

లక్ష్యాలను చేరుకోవాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం వీసీ హాల్‌లో డీసీసీ సమావేశానికి చైర్మన్ కలెక్టర్, కన్వీనర్‌గా లీడ్ బ్యాంకు మేనేజర్ విజయకుమార్ వ్యవహరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అగ్రికల్చర్, ఎమ్మెస్ఎంఈ రంగాలకు త్వరితగతిన అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి నారాయణపేట జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ నుంచి ఏజీఎం శ్రావ్య, నాబార్డ్ నుంచి డీడీఎం షణ్ముఖాచారి, ఎస్‌బీఐ ఏజీఎం రామ్మూర్తి, టీజీబీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, యూబీఐ నుంచి శ్రీనివాసమూర్తి వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకున్నారని ఎల్‌డీఎం విజయ్‌కుమార్ తెలిపారు. వార్షిక రుణ ప్రణాళిక 2025-26గాను 4204.49 కోట్ల రుణ లక్ష్యంతో ఏసీపీ 2025-26 పుస్తక ఆవిష్కరణ కలెక్టర్ చేతుల మీదుగా చేశారు. ఇందులో రైతులకు పంట రుణాలు 2195.07, వ్యవసాయ ఇతర మౌలిక సదుపాయాలకు 1275.87, మొత్తంగా వ్యవసాయ రంగానికి 3470.93 స్వయం సహాయ సంఘాలకు సూక్ష్మ తరహ పరిశ్రమలకు 148, చిన్న తరహ పరిశ్రమలకు 162.30, మొత్తంగా ఎమ్మెస్ఎంఈ రంగానికి 310.30, ఇతర వ్యవసాయేతర రంగాలకు 52.24 రుణాలు మం జూరు చేయాలని నిర్దేశించారు.

అంటే మొత్తంగా ప్రాధాన్య రంగాలకు రూ.3833.48 కోట్ల వరకు రుణాలు మంజూరు చేయాలని నిర్దేశించారు. రాజీవ్ యువ వికాసం ప్లాగ్షిప్ ప్రోగ్రాం ఉన్నందు న బ్యాంకు వాళ్లు సహకరించాలని కలెక్టర్ కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- జడ్చర్ల, రాజాపూర్ మండలాల్లో ఘటనలు

7

నిషేధిత బీజీ-3 పత్తి విత్తనాల పట్టివేత

- జడ్చర్ల మండలం గోప్లాపూర్‌లోని ఓ ఇంట్లో 30 కిలోల పత్తి విత్తనాలు స్వాధీనం

జడ్చర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నిషేధించిన బీజీ-3 రకం పత్తి విత్తనాలను మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గోప్లాపూర్ గ్రామంలో పట్టుకున్నారు. వ్యవసాయ శాఖ, పోలీస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 8 టాస్క్‌ఫోర్స్ బృందాలతో శుక్రవారం గోప్లాపూర్ గ్రామంలోని అనుమానిత ఇళ్లలో సోదాలు నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో ఎలాంటి లైసెన్స్, రశీదులు లేకుండా నిల్వ ఉన్న 30 ప్యాకెట్‌లలో 30 కిలోల నిషేధిత బీజీ-3 రకం పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. గోప్లాపూర్ గ్రామంలో నిషేధిత పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఈ దాడులు జరిగాయి. ఇదిలా ఉండగా తాను 13 ఎకరాలలో పత్తి పంట పండించేందుకు 30 కిలోల బీజీ-3 రకం పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా నుంచి తీసుకువచ్చానని విత్తనాలు కలిగి ఉన్న మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఎవరికీ అమ్మడంలేదని, తనకోసమే తెచ్చుకున్నానన్నాడు. పట్టుబడిన పత్తి విత్తనాలతో దాదాపు 70 ఎకరాలలో పండించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఇన్‌చార్జి ఏడీఏ కృష్ణకిశోర్, ఏవో గోపీనాథ్, నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ జిల్లా కన్సల్టెంట్ రామకృష్ణ ఉన్నారు.



నిషేధిత బీజీ-3 రకం విత్తనాలను స్వాధీనం చేసుకొని, విత్తనాలు కలిగిఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లుగా వివరిస్తున్న డీఏవో వెంకటేశం

జిల్లా వ్యాప్తంగా 15 టాస్క్‌ఫోర్స్ బృందాలు

నిషేధిత బీజీ-3 రకం పత్తివిత్తనాలపై జిల్లా వ్యాప్తంగా 15 టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. నమ్మదగిన సమాచారం మేరకు గోప్లాపూర్ గ్రామంలో 8 టాస్క్‌ఫోర్స్ బృందాలతో సోదాలు నిర్వహించగా మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో 30 కిలోలు పట్టుబడ్డాయి. వీటి విలువ సుమారు రూ. 1.5 లక్షలు ఉంటుంది. వాటిని టూల్‌కిట్‌తో స్ట్రిప్‌టెస్ట్ నిర్వ హించగా నిషేధిత పత్తి విత్తనాలుగా వెల్లడైంది. ఈ ఘటనపై వ్యవసాయ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ చెప్పారు.

- వెంకటేశం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వరి కొయ్యలకు నిప్పు
భూ సారానికి ముప్పు


కింది వరకు కొయ్యాలి



రైతులు వరి పంటను కోసేటప్పుడు పంట పైకి కాకుండా కింది వరకు కోసేల చూడాలి. ఇలా చేస్తే పశుగ్రాసానికి కూడా ఉపయోగపడుతుంది. వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

- మహమ్మద్ సాజిద్ రెహమాన్, వ్యవసాయ శాఖ అధికారి, కేటీదొడ్డి





కేటీదొడ్డిలో రైతులు నిప్పంటించిన వరి కొయ్యలు

- దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి
- సేంద్రియ ఎరువుగా మలుచుకోవాలి
- వ్యవసాయశాఖ అధికారుల సూచన

కేటీదొడ్డి, మే 23 (ఆంధ్రజ్యోతి) : కోతల తర్వాత పొలంలో మిగిలే వరి కొయ్యలకు నిప్పు పెట్టి కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. పంటను కోసిన తర్వాత పొలంలో నీళ్ల వదిలి, కొయ్యలతో సహా భూమిని దున్నితే భూసారం పెరుగుతుందని సూచిస్తున్నారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నా.. కొందరు రైతులు పాటించడం లేదని అంటున్నారు. దీని వల్ల భూసారం దెబ్బతిని దిగుబడిపై ప్రభావం పడుతుందని చెప్తున్నారు. గతంలో రైతులు వరి పంటను కూలీలతో మొదళ్ల దాకా కోయించేవారు. ప్రస్తుతం చాలా మంది రైతులు హార్వెస్టర్లతో కోస్తున్నారు. దీంతో కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. మళ్లీ పంటను సాగు చేసేందుకు పొలం దున్నే సమయంలో కొయ్యలు అడ్డు వస్తున్నాయని రైతులు వాటిని తగులబెడుతున్నారు. దీంతో భూమికి మేలు చేసే కొన్ని రకాల పురుగులు, సూక్ష్మజీవులు చనిపోతాయి. అలాగే కొయ్యలను తగులబెట్టే సమయంలో మంటలు చెలరేగి పొలాల్లో నిల్వ చేసిన గడ్డివాములు, నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసుకున్న పైపులు కాలిపోయే ప్రమాదం కూడా ఉంది. దీనికి తోడు దట్టమైన పొగతో వాయు కాలుష్యం కూడా ఏర్పడుతుంది.

కొయ్యలను కాల్చితే పంటకు నష్టం

వరి కొయ్యలను కాల్చితే పంటకు నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనమూ ఉండదని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. కొయ్యను కాల్చడం ద్వారా వచ్చే విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గిపోతుంది. పంటకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు, రైతుమిత్ర పురుగులు నశించి దిగుబడి సరిగా రాదు. మట్టిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. వరి కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూమిలో కర్బన శాతం పెరిగి ఐదు నుంచి పది శాతం వరకు దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. కొయ్యలతో ఎకరానికి దాదాపు ట న్ను ఎరువు తయారవుతుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరిగి జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటివి పంటకు మేలు చేస్తాయి. భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. అలాగే భూమికి నీటిని, పోషకాలను నిల్వ ఉంచే గుణం పెంచుతుంది. రైతులు వరి పంట కోత తర్వాత కొయ్యను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలి.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కలార్చన



సదస్సులో మాట్లాడుతున్న వనపర్తి జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి జి.కలర్చన

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయలు రాజ్యాంగ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి జి.కలార్చన అన్నారు. ఈనెల 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో వేసవి కాల బోధన, అభ్యసన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం-2012, మానవ అక్రమ రవాణా, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టాలపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కల్పిస్తున్న ఉచిత న్యాయ సహాయం పొందాలని, టోల్ ఫ్రీ నెంబర్ 15100ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.ఉత్తరయ్య, ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు జి.సుదర్శన్‌రావు, పారా లీగల్ వలంటీర్లు రవీందర్, సురేశ్, దయాకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాజు

మదనాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నారు జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు కోరారు. వనపర్తి జిల్లా, మద నాపురం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయిస్తూ కూలీలను పనికి దూరం చేస్తోందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నా కు తరలిరావా లని కోరారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి

తాడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతన దేవాలయంలో చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలన్నీ వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య రెండు రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పార్టీల ముఖ్య నాయకులు సైతం పాల్గొని ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాడూరు గ్రామానికి చెందిన నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మూసాపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని పోల్కంపల్లి శివారులోని వాగు నుంచి శుక్రవారం రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. వాటిని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.వేణు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మనం సైతం.. దేశం కోసం

- ఉత్సాహంగా తిరంగా ర్యాలీలు
- రెపరెపలాడిన జాతీయ పతాకాలు
- పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు



కల్వకుర్తిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు

అచ్చంపేట టౌన్/ కల్వకుర్తి, మే 23 : (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, 'మనం సైతం - దేశం కోసం' సైనికులకు వందనం పేరుతో శుక్రవారం అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాల్లో బీజేపీతో పాటు, వివిధ సంఘాల నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. అచ్చంపేట పట్టణంలోని ఎస్‌బీఐ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు త్రివర్ణ పతాకాలు చేతబట్టి, జై హింద్, జై భారత్ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మాజీ ఎంపీ, రాములు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో భారత దేశం ప్రపంచ దేశాలకు తన సత్తా చాటి చూపించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్, బీజేపీ నాయకులు కట్టా సుధాకర్, మహిళా మర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరు జానకి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రేణయ్య, బాలాజీ, నాగరాజు, సైదులు, శివచంద్ర తదితరులు పాల్గొన్నారు.

- కల్వకుర్తి పట్టణంలోని నిర్వహించిన తిరంగా ర్యాలీలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, వివిధ పార్టీలు, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు, మాజీ సైనికులు పాల్గొన్నారు.





అచ్చంపేటలో పట్టణంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించిన నాయకులు

హోరాహోరీ పోరు

- నాగర్‌కర్నూల్ జట్టు విజయం
- జడ్చర్లలో అండర్-23 క్రికెట్ టోర్నమెంట్



జడ్చర్ల మినీస్టేడియంలో జరిగిన క్రికెట్ మ్యాచ్ క్రీడాకారులతో మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి) : అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో నాగర్‌కర్నూల్ జట్టు విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో కొనసాగుతున్న టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం నాగర్‌కర్నూల్, జడ్చర్ల జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. తొలుత బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు 44.3 ఓవర్లలో 293 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ నిరంజన్ 126 బంతుల్లో 188 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరును అందించాడు. జడ్చర్ల జట్టుకు చెందిన బౌలర్‌లు శివ, కేతన్‌కుమార్‌లు చెరో 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జడ్చర్ల జట్టు 48.1 ఓవర్లలో 247 పరుగులు మాత్రమే చేసింది. అక్షయసాయి 83 పరుగులు చేయగా, సంజయ్ 38, కేతన్‌కుమార్ 33 పరుగులు చేశారు. నాగర్‌కర్నూల్ జట్టుకు చెందిన బౌలర్ రాఖీ మూడు వికెట్‌లు తీయగా, గగన్, జెష్ణు, రాంచరణ్‌లు చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చివరకు జడ్చర్ల జట్టుపై 46 పరుగుల ఆధిక్యంతో నాగర్‌కర్నూల్ జట్టు విజయం సాధించింది.

ముమ్మరంగా పత్తిసాగు

- వర్షానికి పదునెక్కిన పొలాలు



విత్తనాలు నాటుతున్న రైతులు

నర్వ, మే 23 (ఆంధ్రజ్యోతి): తొలకరి వర్షాలు ప్రారంభమై పొలాలు పదును కావడంతో రైతులు పత్తి పంట సాగుకు శ్రీకారం చుట్టారు. మండలంలోని లక్కర్‌దొడ్డి, నాగిరెడ్డిపల్లి, నర్వ గ్రామాల్లో కురిసిన ఓ మోస్తరు వర్షానికి పత్తి విత్తనాల నాటును జోరుగా ప్రారంభించారు. మే నెలలో విత్తనం నాటుకుంటే పత్తి దిగుబడి అధికంగా వస్తుందన్న నమ్మకంతో రైతులు పత్తిని సాగు చేస్తారు. పత్తి నాటు వేసిన తరువాత రెండు, మూడు రోజుల్లో వర్షం వస్తే విత్తనం మొలకెత్తుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కౌలుకు తీసుకొని పత్తి విత్తనం నాటుకున్నా..



నాకున్న నాలుగు ఎకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి విత్తనం నాటుకున్నా. తొలకరి వర్షాలు ఆరంభం కావడంతో పత్తి విత్తనం బాగా మొలుస్తుందన్న నమ్మకంతో పత్తి విత్తనం నాటుకుంటున్నాం. ఈ ఏడాది వర్షం కరుణిస్తే పత్తి పంట దిగుబడి అధికంగా సాధించేందుకు వీలవుతుంది.

- దేవన్న, లక్కర్‌దొడ్డి

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి..



పత్తి పంట సాగుపై రైతులు ఎక్కువ మక్కువ చూపుతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఇటీవల కురిసిన వర్షానికి పొలం పదును కావడంతో నాకున్న ఏడు ఎకరాలతో పాటు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి విత్తనం నాటుకున్నా. ఒక ఎకరానికి రూ.15 వేలు చొప్పున పెట్టుబడి వస్తుంది. ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కూడా కల్పించాలి.

- ముష్టిపల్లి, వెంకప్ప, నర్వ

కొడంగల్ ఎత్తిపోతల సర్వేకు ఆటంకం

- అడ్డుకున్న కాట్రేవ్‌పల్లి రైతులు



సర్వేను అడ్డుకుంటున్న రైతులు

మక్తల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మక్తల్, పేట, కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణంలో భాగంగా నిర్వహిస్తున్న భూ సర్వేకు ఆటంకం కలిగింది. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లి వద్ద శుక్రవారం అధికారులు సర్వే నిర్వహిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో రైతులు కోల్పోతున్న భూముల హద్దులు నిర్ణయించేందుకు సర్వే చేస్తున్నామని అధికారులు వారికి తెలిపారు. ఎంత పరిహారం ఇస్తారో స్పష్టం చేయాలంటూ రైతులు డిమాండ్ చేశారు. అప్పటి వరకు సర్వే చేయనివ్వబోమని తేల్చి చెప్పారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. అయితే ఇప్పటికే సర్వే పూర్తయ్యిందని, కానీ కొందరు రైతులు తమ పొలం ఎంత మేర పోతోందో తెలపాలని కోరినందుకే సర్వే చేసేందుకు వచ్చామని అధికారులు తెలిపారు. మంథన్‌గోడ్ పరిధిలో సర్వే దాదాపు పూర్తయ్యిందని చెప్పారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది రంజిత్, నీటి పారుదల శాఖ ఏఈ నాగశివ, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమలలో మళ్లీ ప్రత్యక్షమైన అడవి దున్న



అప్పాపూర్ సమీప అడవిలో సంచరిస్తున్న అడవి దున్న

మన్ననూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో అడవి దున్న శుక్రవారం మరోసారి ప్రత్యక్షమైంది. ఐటీడీఏ శాఖలో పనిచేస్తున్న ఏఈ రఘు విధుల్లో భాగంగా అప్పాపూర్‌కు వెళుతున్న క్రమంలో అడవి దున్న అడవిలో తిరుగుతూ కనిపించింది. అడవి దున్న ఫొటోను సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వీడియో చక్కర్లు కొడుతోంది. ఏడాది క్రితం అమ్రాబాద్ అడవుల్లోకి ప్రవేశించిన అడవి దున్న ఆత్మకూరు డివిజన్‌లోని బైర్లూటి ప్రాంతానికి తరలివెళ్లినట్లు అక్కడి అడవిలోని సీసీ ట్రాప్ కెమెరాల ద్వారా తెలిసింది. గత 4 మాసాల క్రితం అడవిదున్న తిరిగి అమ్రాబాద్ అభయారణ్యంలోకి ప్రవేశించింది. అడవి దున్నకు నల్లమలలో వాతావరణ పరిస్థితులు అనుకూలించేలా అటవీ అధికారులు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

మెడికల్ దుకాణాల్లో తనిఖీలు

- 18 షాపుల యజమానులకు నోటీసులు

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని పలు మెడికల్ దుకాణాల్లో ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేశ్ కుమార్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మత్తు మందుల (హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్) విక్రయాలు, కొనుగోలుకు సంబంధించి మహబూబ్‌నగర్, జడ్చర్ల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ పట్టణాల్లో ఐదు మెడికల్ దుకాణాల చొప్పున 20 దుకాణాల్లో తనిఖీలు చేశారు. వాటిలో 18 దుకాణాల్లో నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ డైరెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌ను విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్ సూచనలు, సలహాలు లేకుండా మత్తు మందులు వాడొద్దని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. తనిఖీల్లో మహబూబ్‌నగర్ డీఐ రబియా, జడ్చర్ల డీఐ రఫీ, నారాయణపేట డీఐ వినయ్, నాగర్‌కర్నూల్ డీఐ విశ్వంతరెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి ఇసుక క్వారీలో వివాదం

- టిప్పర్లను ఖాళీ చేయించిన అధికారులు



క్వారీలో ఇసుకలోడ్‌తో ఉన్న టిప్పర్లను ఖాళీ చేస్తున్న డ్రైవర్లు

మిడ్జిల్, మే 23 : (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి శివారులోని ఇసుక క్వారీలో శుక్రవారం వివాదం చోటు చేసుకున్నది. ముందుగా క్వారీకి చెందిన టిప్పర్లలో ఇసుక లోడ్ చేశారు. కాగా సీరియల్ నెంబర్ ప్రకారం ఇసుకను లోడ్ చేయాలని స్థానిక టిప్పర్ల యజమానులు ఆందోళనకు దిగారు. ఇసుక తరలించేందుకు టీఎస్ఎం డీసీకి డీడీలు కట్టామని, అయినా తమ టిప్పర్లలో ఇసుకను లోడ్ చేయ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని టీఎస్ఎండీసీ ఉద్యోగి సంతోష్‌రెడ్డి జిల్లా అధికారికి ఫోన్ చేసి తెలిపారు. ఆయన క్వారీ నిర్వాహకులతో మాట్లాడగా వారు సరిగా స్పందించలేదు. దీంతో వారి టిప్పర్లను ఖాళీ చేయించాలని సూచించినట్లు సంతోష్‌రెడ్డి తెలిపారు. అనంతరం టిప్పర్లను ఖాళీ చేయించి పంపించేశారు.

మహిళ అదృశ్యం : కేసు నమోదు

కల్వకుర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుందని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. తెలకపల్లి మండలం దాసుపల్లి గ్రామానికి చెందిన లింగరపు రేణమ్మ, ఆమె కుమారుడు కిశోర్ ఇద్దరూ ఈ నెల 22న స్వగ్రామం వెళ్లేందుకు హైదరాబాద్‌లో కల్వకుర్తి బస్సులో వచ్చి రాత్రి 7గంటల సమయంలో కల్వకర్తిలో దిగారు. అక్కడి నుంచి స్వగ్రామమైన దాసుపల్లికి వెళ్లేందుకు తెలకపల్లి బస్సు ఎక్కే క్రమంలో కుమారుడు మూత్రం వచ్చిందని మూత్రశాలకు వెళ్లి వచ్చే లోపే రేణమ్మ కనిపించలేదు. దీంతో ఆమె కొడుకు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలని అన్నారు.

మహిళల భద్రతే ప్రధాన లక్ష్యం



ఉపాధ్యాయుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న షీటీం జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మీ

తాడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతే ప్రధాన లక్ష్యమని నాగర్‌కర్నూల్ షీటీమ్ జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. తాడూరు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన టీచర్స్ ట్రైనింగ్‌లో షీటీం అవగాహన సదస్సు నిర్వహించారు. 87126576 76నెంబరకు కాల్ చేసి కంప్లైంట్ ఇవ్వొచ్చని తెలి పారు. కార్యక్రమంలో తాడూరు మండల ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, షీటీం మెంబరు వెంకటయ్య, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మానసిక సమస్యలతో మహిళ ఆత్మహత్య

మానవపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి) : మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఏఎస్ఐ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ కాలనీకి చెందిన బోయ సుజాత (45) భర్త కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మానసికంగా బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కాలనీవాసులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుమార్తెలు పూజిత, పుష్పలతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ...

మిడ్జిల్, మే 23(ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన కేశ యాదయ్య (52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయడు తెలిపారు. కుటుంబసభ్యులతో చిన్న గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంటి సమీపంలోని మల్లయ్య గుడి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతడి భార్య పద్మకు సమాచారం అందించారు. అనంతరం యాదయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. సంఘటనపై అతడి కుమారుడు కేశ మల్లేశ్ ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అప్పులు తీర్చలేక మరొకరు..


రాము (ఫైల్)

మద్దూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : చేసిన అప్పలు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నారాయణపేట జిల్లా, మద్దూర్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోయిలకొండ మండలం దమాయపల్లి గ్రామానికి చెందిన రాము (42) అనే వ్యక్తి మద్దూర్‌లో 15 సంవత్సరాలుగా శ్రీ వెంకటేశ్వర్ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పు చేసి మరో కోస్గీలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు తన భార్యకు మద్దూర్‌లో శారీ సెంటర్‌ను ఏర్పాటు చేయించాడు. అవి సరిగ్గా నడుబకపోవడంతో నష్టాలపాలయ్యాడు. దీంతో చేసిన అప్పులను తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాము తమ్ముడు వరద సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

» తొమ్మిది రోజుల క్రితం రోడ్డు ప్రమాదం
» తీవ్రంగా గాయపడి భర్త, కుమార్తె మృతి


శిరీష (ఫైల్)

వెల్దండ, మే 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్ర మాదంలో తీవ్రంగా గాయపడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, తెల్కపల్లి మండలంలోని నెల్లికుదురుకు చెందిన కొమ్మల సాయి(28), భార్య శిరీష(25), ఎనిమిది నెలల కూతురు తేజశ్రీతో కలిసి ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు ఈనెల 13న కారులో హైద రాబాద్ నుంచి పెద్దూరుకు బయలుదేరారు. వీరు వెళ్తున్న కారు వెల్దండ సమీపంలోని వీజేఆర్ ఫుడ్ విలేజ్ సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై ఇనుప సీకుల లోడుతో నిలుచున్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొన్నది. ప్రమాదంలో చిన్నారి తేజశ్రీ అక్కడికక్కడే మృతి చెందింది. సాయి స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. శిరీష పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో స్వగ్రామం నెల్లికుదురులో విషాదఛాయలు అలుముకున్నాయి.

హత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్యగౌడ్, ఎస్ఐ గోవర్ధన్

నాగర్‌కర్నూల్ క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళ కేసును పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కనకయ్యగౌడ్, ఎస్ఐ గోవర్ధన్‌లు వెల్లడించారు. గత ఫిబ్రవరిలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగంలోని నాగనూల్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాల సమీపంలో కావలి శాంతమ్మ (56) అనే మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అతడు తిమ్మాజిపేట మండలంలోని నేరెళ్లపల్లి గ్రామంలో ఉన్నట్లు గుర్తించి పట్టుకుని విచారించగా మహిళపై అత్యాచారం చేసి, చంపినట్లు నిర్ధారణ అయ్యింది. నేరాన్ని అంగీకరించడంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

» జడ్చర్ల, రాజాపూర్ మండలాల్లో ఘటనలు

జడ్చర్ల/ రాజాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల, రాజాపూర్ మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల మండలంలోని మాచారం గ్రామ సమీపంలోని ఓ హోటల్ వద్ద గురువారం రాత్రి రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తి (30)ని హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

బైక్, లారీ ఢీకొని..

రాజాపూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... మిడ్జిల్ మండలం మున్ననూర్ గ్రామానికి చెందిన యాదయ్య, నారమ్మ దంపతులు హైదారాబాద్‌లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం జడ్చర్ల సమీపంలో జరిగిన వివాహానికి హాజరైన వారు, ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. వారు వెళ్తున్న వాహనాన్ని రాజాపూర్ శివారులో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఇద్దరూ కిందపడిపోయారు. యాదయ్య (56) తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై భార్య నారమ్మ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బడి బస్సులు భద్రమేనా?

» స్కూల్ బస్సులకు 'ఫిట్‌నెస్' తప్పనిసరి
» వచ్చే నెల 15 వరకు పరీక్షలకు గడువు
» వనపర్తి జిల్లా వ్యాప్తంగా 314 బస్సులు
» ఇప్పటివరకు 42 బస్సులకు మాత్రమే తనిఖీలు
» మరో 20 రోజుల్లో విద్యా సంస్థలు ప్రారంభం


గత ఏడాది వనపర్తి మండల పరిధిలోని రాజనగరం సమీపంలో ప్రమాదానికి గురైన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు (ఫైల్)

వనపర్తి, మే 23(ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థలు ప్రారంభమయ్యే సమయానికి స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాల్సి ఉంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా స్కూల్ బస్సులను నడిపితే సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తారు. ఈ విషయంపై వనపర్తి జిల్లా రవాణా శాఖ అధికారులు ఇప్పటికే ఆయా పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. మరో 20 రోజుల్లో విద్యా సంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకు ముందే బస్సులకు మరమ్మతులు పూర్తి చేసుకొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి స్కూల్ బస్సులను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

కాలం చెల్లిన బస్సులు 73

జిల్లా వ్యాప్తంగా 314 స్కూల్ బస్సులు ఉన్నాయి. వాటిలో 15 ఏళ్లు దాటి, కాలం చెల్లిన బస్సులు 73 ఉన్నాయి. ఈ సారి వీటికి అధికారులు అనుమతులు ఇస్తారా? లేదా వేచి చూడాలి. మిగతా 241 బస్సుల్లో ఇప్పటి వరకు 42 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ తనిఖీలు చేయించుకున్నారు. ఇంకా 199 బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీలు చేయించి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంది. గత ఏడాది తీసుకున్న ఫిట్‌నెస్ ధ్రువపత్రాల గడువు ఈ నెల 15వ తేదీన ముగిసింది. పాఠశాలలు తెరిచే లోపు ఫిట్‌నెస్ తనిఖీలు చేయించుకోకుండా రోడ్డు ఎక్కితే అధికారులు బస్సులను సీజ్ చేసే అవకాశం ఉంది. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడానికి వచ్చే నెల 15వ తేదీ వరకు స్కూల్ యాజమాన్యాలకు అధికారులు గడువు ఇచ్చారు.

యాజమాన్యాలకు అవగాహన కల్పించాం



స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఈ విషయంపై సంబంధిత పాఠశాలల యజమాన్యాలకు అవగాహన కల్పించాం. బస్సులకు అధికారుల పర్యవేక్షణలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తాం. రవాణా శాఖ అధికారులు సూచించిన నిబంధనల మేరకు అన్ని భద్రతా ఏర్పాట్లు, సౌకర్యాలు ఉన్న వాటికి మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తాం. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధికారులకు సహకరించాలి.

మానస,
జిల్లా రవాణా శాఖ అధికారి .

నిబంధనలు బేఖాతరు

జిల్లాలో చాలా పాఠశాలల బస్సులు సరైన కండిషన్‌లో లేనట్లు తెలుస్తోంది. అయినా రవాణా శాఖ అధికారుల నిబంధనలను బేఖాతరు చేస్తూ గత ఏడాది కొన్ని పాఠశాలల యాజమాన్యాలు బస్సులను నడిపించారు. వాటిల్లో కాలం చెల్లిన బస్సులు ఉన్నా పట్టించుకోవడం లేదు. గత ఏడాది స్కూలు బస్సులు ప్రమాదానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. అయితే పాఠశాలలు పు నఃప్రారంభం అయిన తర్వాత హడావిడిగా బస్సులను తనిఖీ చేసి సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు స్పందించి జిల్లాలోని అన్ని స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీలు చేయించి, అనుమతులు తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ నిబంధనలు తప్పనిసరి

స్కూల్ బస్సులకు నిబంధనల మేరకు పూర్తి స్థాయిలో తనిఖీలు చేయించాల్సి ఉంది. బస్సులకు పవర్ స్టీరింగ్, డాష్ ప్యానెల్ బోర్డులో ఎడమ, కుడి ఇండికేటర్లు తప్పనిసరిగా ఉండాలి. బ్రేకుల లోపం తెలిపే ఎరుపు ఇండికేటర్ ఉండాలి. ఫ్యూయల్ గేజ్, స్పీడో మీటర్, డ్రైవర్ సీట్ దగ్గర ఎయిర్ హ్యాండ్ బ్రేక్ ఉండాలి. వెనుక దారి కనిపించేలా అద్దం, బస్సులో కూర్చున్న విద్యార్థుల కదలికలు కనిపించేలా ఇంటర్నల్ అద్దం. విద్యార్థులు ఎక్కడం, దిగడం కనిపించేలా క్రాస్ వ్యూ అద్దాలను తప్పనిసరిగా అమర్చుకోవాలి. అత్యవసర సమయంలో తలుపు అద్దాన్ని పగలగొట్టేందుకు సుత్తి, తలుపులకు సురక్షితమైన లాకింగ్ వ్యవస్థ ఉండాలి. బస్సు డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించి ఉండొద్దు. అతడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి. బస్సు సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు. ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స కిట్టు తప్పనిసరిగా ఉండాలి.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠోత్సవం


హైమాస్ట్ లైట్‌లను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ


ప్రతిష్ఠించిన శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

» ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు

మరికల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మరికల్ మండలంలోని పసుపుల గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య విగ్రహాల ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. శివలింగం, నంది, గణపతి, నవగ్రహాలు, గ్రామ దేవత మైసమ్మ, బొడ్రాయి, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలమూరు ఎంపీ డీకే అరుణ హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. వేద పండితులు చంద్రశేఖర్, శర్మ, నవీన్ శర్మల ఆధ్వర్యంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా సుప్రభాతసేవ, లక్ష్మీగణపతి, రుద్ర, సుదర్శన, శ్రీసూక్త సహిత లక్ష్మీ హోమాలు నిర్వహించారు. నూతన విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం ఉదయం యంత్రబింబ స్థాపన, ప్రాణప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, అధికార ప్రతినిధి చిన్న నర్సన్ గౌడ్, మండల అధ్యక్షుడు వేణు, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి, భీమన్న పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా లీగ్ టోర్నీలో పాలమూరు విజయం

» 5 వికెట్లు తీసిన ముఖీద్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, పక్కన ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్, సభ్యులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా, అండర్-23 లీగ్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు గద్వాల జట్టుపై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో ఈ టోర్నీ కొనసాగుతోంది. అందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన గద్వాల జట్టు మొదట బ్యాటింగ్ చేసి, 25.2 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌట్ అయ్యింది. గద్వాల జట్టులో రాహుల్ యాదవ్ 62 బంతుల్లో ఒక సిక్స్, 7 ఫోర్లతో అర్ధసెంచరీ(53) సాధించాడు. మణిగణేష్ 11, జానీ 10 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లలో ముఖీద్ 7 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసి రాణించాడు. కే శ్రీకాంత్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 21 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసి విజయం సాధించింది. శ్రీకాంత్ 17, అభిలాష్‌గౌడ్ 18, డేవిడ్ క్రిపాల్ 44, షాదాబ్ అహ్మద్ 12 పరుగులు చేసి జట్టు చేసి జట్టు విజయానికి కృషి చేశారు. వరుసగా రెండు మ్యాచ్‌లలో మహబూబ్‌నగర్ జట్టు గెలుపొందింది.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని మహబూబ్‌నగర్ అర్బన్ అథారిటీ చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. మహబూబ్‌నగర్, గద్వాల జట్ల మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి రంజీకి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, అశోక్, సీనియర్ క్రీడాకారుడు శ్రీను పాల్గొన్నారు.


5 వికెట్లు తీసి రాణించిన మహబూబ్‌నగర్ జట్టు బౌలర్ ముఖీద్

నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించాలి

» నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
» ఇందిరమ్మ మోడల్ హౌస్ పరిశీలన


జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వ సూచనలు, నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. వివరాలను చెక్‌లిస్ట్ ప్రకారం సరి చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ మండల కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను శుక్రవారం ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన పైలట్ గ్రామాల్లో గ్రౌండింగ్ పూర్తి చేసి బేస్ మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. ప్రిపరేషన్, సమస్యలు, ఆశిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోటేశ్వర్‌రావు, మునిసిపల్ కమిషనర్ నరేశ్, లైబ్రేరియన్ పరమేశ్వరి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ స్పోర్ట్స్ అకాడమీల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎఫ్‌ఏసీ డీవైఎస్‌వో మధుసూదన్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, సైక్లింగ్, రెజ్లింగ్, హాకీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్ అకాడమీల్లో ప్రవేశానికి 14 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సున్న బాల, బాలికలు అర్హులని పేర్కొన్నారు. వచ్చేనెల 1న సిద్దిపేట వాలీబాల్ అకాడమీ, 10, 11 తేదీల్లో హైదరాబాద్ ఓయూ క్యాంపస్‌లో సైక్లింగ్ అకాడమీ, హన్మకొండ అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, హ్యాండ్‌బాల్ అకాడమీల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10న రాజన్న సిరిసిల్లా జిల్లాలోని మినీ స్టేడియంలో సరూర్‌నగర్, రాజన్న సిరిసిల్ల వాలీబాల్ అకాడమీ, 12న వనపర్తిలో హాకీ అకాడమీల్లో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 12న ఖమ్మంలో అథ్లెటిక్స్ అకాడమీ, 12, 13 తేదీల్లో మహబూబ్‌నగర్ వాలీబాల్ అకాడమీల్లో ప్రవేశానికి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, జననధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, క్రీడా ధ్రువపత్రాలు, 10 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఆయా అకాడమీల్లో నిర్వహించే ఎంపికలకు హాజరు కావాలని కోరారు. మరింత సమాచారం కోసం జిల్లా క్రీడాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

వాటర్ బిల్లులు చెల్లించండి

» రైల్వే శాఖకు కార్పొరేషన్ నోటీసులు
» పదేళ్లలో రూ.5.30 లక్షల బకాయి



మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ

మహబూబ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లులను వెంటనే చెల్లించాలని రైలే శాఖ అధికారులకు కార్పొరేషన్ అధికారులు నోటీసు జారీ చేశారు. 2015 - 25 మధ్య కాలంలో భారీగా బకాయిలున్నాయని, వాటని వెంటనే చెల్లించాలని కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి రైల్వే ఆఫీస్ ఆఫ్ ద సీనియర్ సెక్షన్ ఇంజనీరుకు నోటీసు అందించారు. నీటి బిల్లు 2015 నుంచి ఇప్పటి వరకు రూ.7,16,313 చెల్లించాల్సి ఉండగా, రూ.1,86,290 మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.5.30 లక్షల బకాయి ఉంది. రైల్వేకు కిలోలీటర్‌ల చొప్పున బిల్లులు వసూలు చేస్తారు. ప్రతీ కిలో లీటర్‌కు రూ.130 చొప్పున బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన 2015లో 44.1 కిలోలీటర్ల నీటికి రూ.5,733, 2015 అక్టోబరు నుంచి 2016 ఏప్రిల్ వరకు 99.2 కిలోలీటర్ల నీటికి రూ.12,896, 2016 ఏప్రిల్‌నుంచి 2025 మే 17 వరకు 5366.8 కిలోలీటర్ల నీటికి రూ.6,97,684 నీటి బిల్లులు వేశారు. చెల్లించిన మొత్తం పోను మిగిలిన రూ.5.30 లక్షలు చెల్లించాలంటూ కార్పొరేషన్ అధికారులు రైల్వే శాఖకు నోటీసులు జారీ చేశారు.

పాత బకాయిల వసూళ్లపై దృష్టి

కార్పొరేషన్ ఆదాయం పెంచుకోవడంలో భాగంగా పాత బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. నీటి పన్నులతో పాటు ఆస్తిపన్ను బకాయిలు పెద్ద ఎత్తున ఉండగా, వాటి వసూలు కోసం అధికార యంత్రాంగం నోటీసులు జారీ చేస్తోంది. అయినా ఆశించిన మేర వసూలు కావడం లేదు. ప్రజలు ఆస్తి పన్నుతో పాటు నీటి పన్నులు, దుకాణాల అద్దెలను సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నులతో పాటు పాత పన్నుల బకాయిలు అధిక మొత్తంలో పేరుకుపోవడంతో బకాయిల బండ రూ.10 కోట్లు దాటింది. దీంతో మొండి బకాయిల వసూలు అధికారులకు కష్టసాధ్యంగా మారింది. బలవంతంగా వసూలు చేసేందుకు యత్నిస్తే నాయకుల ద్వారా పైరవీలు చేసుకొని తప్పించుకుంటున్నట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గ్రామ కంఠం భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదు

● గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



ధన్వాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): ధన్వాడలో గ్రామ కంఠం భూములు కబ్జాకు గురవుతున్నాయని, కబ్జాకు గురవుతున్న స్థలాల్లో ఇంటి నిర్మాణాలు కొనసాగుతున్నాయని, పంచాయతీ నుంచి ఇంటి నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

గ్రామ కంఠం భూముల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చారా?

ఇంటి నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు.

కబ్జాకు గురైన భూముల విషయమై కమిషన్‌కు ఫిర్యాదులు చేశారు కదా?

కబ్జాకు గురైన భూముల విషయంపై ఫిర్యాదులు వచ్చాయి. అది మా పైఅధికారుల పరిధిలో ఉంది.

గ్రామ కంఠం భూముల్లో పాతిన బోర్డులు లేవు కదా?

నేను మా పైఅధికారులం కలిసి అందరి సమక్షంలో గ్రామ కంఠం భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసింది నిజమే. బోర్డులు విషయం తెలుసుకుంటాం.

గ్రామ కంఠం భూములు కబ్జాకు గురి కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వం ఏం చెపితే అది చేస్తాం. ప్రభుత్వ ఆదేశాలను తప్పక పాటిస్తాం.

పైఅధికారులకు మీపై ఫిర్యాదులు చేశారు. దీనిపై మీ స్పందన?

నేను ప్రభుత్వ భూములను కాపాడుతాను తప్ప ప్రోత్సహించాను. నేను ఎలాంటి తప్పు చేయలేదు. తప్పు చేసినప్పుడు ఎవరైనా ఫిర్యాదు చేసుకోవచ్చు.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట	కనిష్ట
		(రూపాయలలో)	
వడ్లు సోనా	291.00	2,092	1,400
వడ్లు హంస	10.20	1,700	1,700

న్యూస్ బాక్స్

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

దామరగిద్ద, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సాయిలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి, అర్హత గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట న్యూటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని వీరసావర్కర్ చౌరస్తాలో శుక్రవారం స్థానిక పోలీసులు సైబర్ నేరాల కట్టడి, రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ నారాయణ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్‌లో గుర్తు తెలియని సందేశాలకు స్పందించవద్దని, అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలను నడపొద్దని సూచించారు. ట్రాఫిక్ పోలీస్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

కక్షపూరితంగానే కేసీఆర్‌కు నోటీసులు

మరికల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు రాజకీయ కక్షపూరితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు ధ్వంసమైతే మరమ్మత్తు చేసి ప్రాజెక్టులో నీళ్లు నింపి సాగునీరు అందించకుండా, కేసీఆర్‌పై బురదజల్లే కార్యక్రమం చేపట్టిందన్నారు. కేసీఆర్ 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రభుత్వం వందశాతం పూర్తి చేసి చూపించాలన్నారు.

పాము పట్టివేత

నారాయణపేట న్యూటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ ఇంట్లోకి దూరిన పామును పాములు పట్టే నరేష్ అనే వ్యక్తి పట్టుకున్నాడు. గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి దూరిన పామును గమనించిన కుటుంబీకులు వెంటనే స్థానికుల సహాయంతో నరేష్‌కు సమాచారమందించారు. వెంటనే ఆయన పామును పట్టుకొని సుదూర ప్రాంతంలో వదిలేశాడు.

అకాలంలో అన్నదాతల ఆరాటం

» పత్తి విత్తనాల కొనుగోళ్లలో రైతాంగం
» పొలాల్లో దుక్కులతో బిజీబిజీ



కోస్గి మండలం భోగారం గ్రామంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేస్తున్న రైతులు



నారాయణపేట జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాలు పొందుతున్న అన్నదాతలు

నారాయణపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో కురిసిన అకాల వర్షాలతో అన్నదాతల్లో హడావిడి నెలకొంది. ఈనెల 25 నుంచి రోహిణికార్తె ప్రారంభమై జూన్ 8న ముగియనుంది. రోహిణిలో రోళ్ల పలిగే ఎండలు ఉంటాయని చెబుతున్నా ముందస్తుగా కురిసిన అకాల వర్షాలతో వాతావరణం గత ఐదురోజుల నుంచి మేఘావృతమై అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో వానాకాలం సాగుకు జిల్లా రైతాంగం సన్నద్ధం అవుతోంది. ప్రస్తుతం కురిసిన వర్షాలతో ట్రాక్టర్లు, నాగళ్లతో పొలాలను దుక్కే పనుల్లో అన్నదాతలు బిజీబిజీగా ఉన్నారు. పరిసర గ్రామాల రైతులతో పాటు, పక్కనే ఉన్న కర్ణాటక రైతులు నారాయణపేట జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాలు పొందేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పత్తి ప్యాకెట్ల కొనుగోళ్లతో ఎరువుల దుకాణాల వద్ద రైతుల సందడి నెలకొంది. వచ్చే వానాకాలం సాగుకు ముందస్తు చర్యలు తీసుకుంటూ విత్తనాలు పొందే పనిలో రైతాంగం దృష్టి సారించింది. కర్ణాటక, యాదగిరి, గుల్బర్గా జిల్లాలో సైతం విస్తారంగా వర్షాలు కురియడంతో పొలాలను దున్ని పత్తి విత్తనాల కోసం వచ్చామని కర్ణాటక రైతులు చెబుతున్నారు. విత్తనాలు సిద్ధం చేసుకొని జూన్ నెలలో ఓ భారీ వర్షం కురిస్తే పత్తి పంటను విత్తుతామని పేర్కొన్నారు. కర్ణాటకతో పాటు జిల్లా రైతాంగం వచ్చే వానాకాలం సాగుకు ముందస్తు చర్యలతో బిజీబిజీగా వ్యవసాయ పనులపై దృష్టిని సారించారు.

ఖరీఫ్‌కు సమాయత్తం

కోస్గి రూరల్/కొత్తపల్లి : మూడు రోజుల నుంచి కోస్గి ఉమ్మడి మండలంలో వర్షపు జల్లులు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్‌కు సమాయత్తమవుతూ వేసవి దుక్కులు చేపడుతున్నారు. భూసార పెంపునకు పచ్చిరొట్ట పెంచడం వంటివి చేస్తే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయ అధికారులు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాలతో రైతులను సమాయత్తం చేస్తున్నారు. కోస్గి ఏవో రామకృష్ణ వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అదేవిధంగా, కొత్తపల్లి మండలం భూనీడు గ్రామ శివారులో రైతులు పెసళ్ల పంట సాగుకు శ్రీకారం చుట్టారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. గతేడాది జీలుగ(పచ్చిరొట్ట) విత్తనాలకు ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ అందించగా, ఈయేడాది పది శాతం పెంచి 50 శాతానికి ఇవ్వడంతో రైతులు జీలుగకు బదులు పెసళ్లు వేసుకుంటున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నారాయణపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం రెండో రోజు జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో జిల్లాలోని 11 కేంద్రాల్లో సజావుగా కొనసాగాయి. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగాయి. జనరల్ విద్యార్థులు 780 మందికి 742 మంది ఫస్టియర్ పరీక్షలు రాయగా 38 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ 53 మందికి 51 మంది పరీక్షలు రాయగా ఒకరు గైర్హాజరయ్యారు. మొత్తం ఫస్టియర్‌లో 833 మందికి 794 మంది పరీక్షలు రాయగా 39 మంది గైర్హాజరయ్యారు. సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు జరిగాయి. జనరల్ విద్యార్థులు 79 మందికి 74 మంది పరీక్షలు రాయగా ఐదు మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ ఎనిమిది మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 87 మందికి 82 మంది పరీక్షలు రాయగా ఐదుగురు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నారాయణపేటలో మూడు, మక్తల్‌లో మూడు, కోస్గిలో రెండు, మద్దూర్‌లో ఒకటి, మరికల్‌లో ఒకటి, ధన్వాడలో ఒకటి పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఐదు కేంద్రాల్లో జనరల్ విద్యార్థులతో పాటు వొకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాశారు. 11 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 11 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ముగ్గురు అడిషనల్ సూపర్‌వైజర్లు, ఇద్దరు కస్టోడియన్స్ సిట్టింగ్ స్క్వాడ్స్ ఒక బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం పరీక్షలను పర్యవేక్షించారు.

ధర్నాకు తరలి రావాలి

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి



దామరగిద్ద మండలం కందెన్‌పల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్

ఊట్కూర్/దామరగిద్ద/ నారాయణపేట రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రతీ రోజు రూ.600 కూలీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మే 26న కలెక్టరేట్ ముందు నిర్వహించతలపెట్టిన ధర్నాకు తరలిరావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో ఉపాధి పని చేసుకుని తిరిగివస్తున్న కూలీలను కలిసి ధర్నాకు సంబంధించిన కరపత్రాలు పంచి, మాట్లాడారు. ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని కోరుతూ చేపట్టే ధర్నాకు కూలీలందరు తరలిరావాలని ఆయన కోరారు.

అదేవిధంగా, దామరగిద్ద మండలం కందెన్‌పల్లి, క్యాతన్‌పల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, మండల కార్యదర్శి శివకుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాకు కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రవి, ఎల్లప్ప, బ్యాగరి నర్సింహ్మ, రేణమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశాలను సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో నరహరి, పవన్ తదితరులున్నారు.

సంచార జాతి విద్యార్థులకు చదువేదీ?



మక్తల్‌లోని ప్రాథమిక పాఠశాలకు కాలినడకన వెళుతున్న సంచార జాతి విద్యార్థులు

» పట్టించుకోని పాలకులు

మక్తల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని బీసీ కాలనీలో 120 మందికి పైగా విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023లో అప్పటి కలెక్టర్ కోయ శ్రీహర్షకు విన్నవించడంతో కాలనీలో పాఠశాలను ప్రారంభించారు. ఈ పాఠశాలకు సుమారు 90 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1990లో ప్రభుత్వం బీసీ కాలనీ పేరిట బుడగ జంగం, దక్కలి, ఇతర సంచార జాతులకు చెందిన 120 కుటుంబాలు ఈ కాలనీలో నివాసం ఉంటున్నాయి. కాగా, 2023 దసరా అనంతరం పాఠశాల ప్రారంభించిన ఆరు నెలలకే మూతపడటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణానికి 4 కిలో మీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కొందరు చదువు మాని భిక్షాటన, కూలీ పనులు చేశారు. అధికారుల నిర్లక్ష్యం, ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో కొన్నాళ్లకే మూతపడ్డ పాఠశాలను ఎవరూ పునరుద్ధరించలేదు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనైనా పాఠశాలను పునఃప్రారంభించి విద్యార్థులకు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పాఠశాలను పునః ప్రారంభించాలి



మక్తల్ పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న బీసీ కాలనీలో 120 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కాలనీలో ఏర్పాటు చేసిన పాఠశాల మూతపడటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే కాలనీలో పాఠశాలను పునఃప్రారంభించాలి. పాఠశాల మూతపడటంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు.

- రాసూరి భీమేష్, బుడగజంగం పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు

28న దిశ కమిటీ సమావేశం

నారాయణపేట టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ హాల్‌లో నారాయణపేట జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఈనెల 28న ఉన్నందున సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అందరు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులు నోట్ స్కీమ్స్ రేపటివరకు ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో మొగులప్ప, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ఊట్కూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపొర్ల గ్రామం నుంచి గాడుదుల వాగు ద్వారా ఊట్కూర్‌కు వెళ్లే రోడ్డును మెటల్‌గా మార్చి రైతులను ఆదుకోవాలని పెద్దపొర్ల గ్రామ రైతులు గురువారం రాత్రి మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలోని 40 వ్యవసాయ కుటుంబాలు 200 ఎకరాల భూమిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. రోడ్డు వ్యవస్థ లేక నిత్యం ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే పీఆర్ ఏఈతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నారాయణపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన వీహెచ్‌పీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు కుటుంబాన్ని ఎంపీ డీకే అరుణ పరామర్శించారు. పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఉన్న ఆయన ఇంటికి శుక్రవారం ఎంపీ వెళ్లి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. రాంబాబు భార్య సురేఖ, కుమార్తె డాక్టర్ ఐశ్వర్యలను ఓదార్చారు. ఎంపీ వెంట బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, ల్యాబ్ నర్సింహ తదితరులున్నారు.

బాల కేంద్రాల వల్లే సంప్రదాయ కళలకు జీవం

● డీఈవో గోవిందరాజులు

నారాయణపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ, శాస్త్రీయ కళలకు జీవం పోస్తున్నది బాలకేంద్రాలే అని, చిన్నారులు తమకు నచ్చిన కళలు నేర్చుకోవాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. శుక్రవారం నారాయణపేట బాలకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారులకు కళలపై అందిస్తున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు తమకు శిక్షణ చక్కగా ఇస్తున్నారని చెప్పడంతో డీఈవో శిక్షకులను అభినందించారు. కేంద్రం కోఆర్డినేటర్ నాగార్జునరెడ్డి, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సంగనర్సింలు, వసంత్‌కుమార్, జ్ఞానామృత, పీఈటీ రమణ ఉన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం సీజ్



పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసిన సివిల్ సప్లై డీఎం సైదులు, అధికారులు

నారాయణపేట టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. నారాయణపేట మండలం అప్పారెడ్డిపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని సివిల్ సప్లై డీఎం సైదులు శుక్రవారం సీజ్ చేశారు. సివిల్ సప్లై డీఎం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కాశప్ప, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గడువులోగా అనుమతులు మంజూరు చేయాలి



పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

» కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ టీజీఐ పాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుంచి మంజూరు చేయాల్సిన అనుమతులను నిబంధనల మేరు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆమె హాజరై, మాట్లాడారు. ఎస్సీ 9, ఎస్టీ 6, పీహెచ్‌సీలకు 1, పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు డీఐపీసీ కమిటీలో ఆమోదం తెలిపారు. సమావేశంలో జీఎం భరత్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్, ఏఈ వెంకటకృష్ణారెడ్డి, లేబర్ శాఖ తరఫున తిలక్, డీఎఫ్‌వో సురేష్‌రెడ్డి, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ నరేష్, ఈఈ సురేష్‌బాబు, ఎన్.యోగేందర్, ఫ్యాక్టరీస్ కిరణ్‌కుమార్, రోహిన్, సయ్యద్ జహీర్, సబ్ రిజిస్ట్రార్ రామ్‌జీ, ఆర్డీవో మేఘాగాంధీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి

రాజీవ్ యువ వికాసం ద్వారా అనేక మంది యువత ఉపాధి పొందుతారని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం రాజీవ్ వికాసం పథకం పర్చేజ్ కమిటీ ఫర్ ఆల్ కార్పొరేషన్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, ట్రాన్స్‌పోర్ట్, రిటైల్ షాప్ సర్వీసెస్, కమిటీ ఫర్ మ్యానుఫాక్చరింగ్, ఫిషరీస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్ తదితర శాఖలు కమిటీలో ఉన్నాయని తెలిపారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల ఫైనాన్సియల్ అసిస్టెంట్, గ్రౌండింగ్ తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఈడీఎస్‌సీ కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్, ఎల్‌డీఎం విజయ్‌కుమార్, జడ్పీ సీఈవో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శిక్షణను వినియోగించుకోవాలి



మరికల్‌లో ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డైట్ కళాశాల లెక్చరర్ సిరాజుద్దీన్, పక్కన డీఈవో గోవిందరాజులు

» డీఈవో గోవిందరాజులు

ధన్వాడ/మరికల్, మే 23 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకుపోవడం కోసం ఇచ్చే శిక్షణను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని డీఈవో గోవిందరాజులు కోరారు. ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణను శుక్రవారం డీఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణను పరిశీలించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. విద్యార్థులకు బోధన ఎలా ఉండాలో ఆర్పీలు ఇచ్చే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గాయత్రి, సీఆర్పీలు ఎం.నారాయణ, వెంకట్రాములు పాల్గొన్నారు.

అదేవిధంగా, మరికల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను శుక్రవారం డీఈవో గోవిందరాజులు, డైట్ కళాశాల లెక్చరర్ సిరాజుద్దీన్‌లు తనిఖీ చేసి, మాట్లాడారు. విద్యార్థులు పదాలు గుర్తించడం, వాటిని అర్థం చేసుకోవడం, సరళమైన గణిత భావనలను నేర్చుకోవడం వంటి విషయాలను వారు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో మనోరంజని, మండలంలోని వివిధ పాఠశాలల ఎస్‌జీటీ, పీఎస్‌ల హెచ్‌ఎంలు, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



క్రికెట్ క్రీడాకారులతో సుక్రోనాయక్

నారాయణపేట న్యూటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మర్ క్రికెట్ క్యాంపును వినియోగించుకోవాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ డీఈపీ డా.సుక్రోనాయక్ అన్నారు. మినీ స్టేడియంలో కొనసాగుతున్న క్రికెట్ క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొని మాట్లాడారు. ప్రతీ క్రీడాకారుడు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని కోరారు. క్యాంపు ఇన్‌చార్జి రమణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

సర్కారు కాలేజీల్లోనే ఉన్నతమైన చదువు



ప్రభుత్వ కళాశాలలో చేరాలని బాపన్‌పల్లిలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచిస్తున్న అధ్యాపకులు

దామరగిద్ద, మే 23 (ఆంధ్రజ్యోతి): సర్కారు కాలేజీల్లోనే ఉన్నతమైన విద్య అందుతుందని సీనియర్ అధ్యాపకుడు పి.రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాపన్‌పల్లి గ్రామంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ కళాశాలల్లో విద్యాబోధన, మౌలిక వసతులు, సౌకర్యాల గురించి వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇంటర్ ఉత్తీర్ణతలో ఈఏడాది పేట జిల్లాలోనే మొదటి స్థానంలో దామరగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రషీద్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

టీటీడీలో బిజ్వార్ భజన మండలి సభ్యుల అఖండ భజన



తిరుమలలో భజన చేస్తున్న బిజ్వార్ భజన మండలి సభ్యులు

ఊట్కూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన పడమటి ఆంజనేయస్వామి భజన మండలి సభ్యులు గురువారం రాత్రి తిరుమలలో అఖండ భజన నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది హిందు ధర్మ ప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనలో భాగంగా పడమటి ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. ఇప్పటివరకు 10 సార్లు తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన చేయడం జరిగిందని అధ్యక్షుడు దోరేళ్ల కృష్ణయ్య తెలిపారు. భజన వల్ల వ్యక్తిలో మంచి గుణాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, హెచ్.నర్సింహా, వెంకటప్పగౌడ్, వెంకటప్ప, దరిమిది నరసింహ, నాగిరెడ్డి, మారుతి, శివారెడ్డి, ఆంజనేయులు, రాజమూరి, తిమ్మప్ప, దత్తప్ప, శ్రీనివాస్ ఉన్నారు.